# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 04-03-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **పర్యావరణ పరిరక్షణలో వన్యప్రాణుల సంరక్షణ ముఖ్య భూమికను పోషిస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పౌరుడికి డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు.**
3. **తెలంగాణకు కృష్ణా జలాల కేటాయింపులు సమానంగా జరగాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు.**
4. **తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది.**
5. **గోదావరి డెల్టా ప్రాంతంలో పూడికతీత కార్యక్రమాలను చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

==========================

పర్యావరణ పరిరక్షణలో వన్యప్రాణుల సంరక్షణ ముఖ్య భూమికను పోషిస్తుందని ప్రధానమమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గుజరాత్ జునాగఢ్‌లోని ససన్ గిర్లో జరిగిన జాతీయ వన్యప్రాణుల బోర్డు 7వ సమావేశానికి ప్రధానమంత్రి అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో దేశంలో తొలిసారిగా నిర్వహించిన నదీతీర డాల్ఫిన్ అంచనా నివేదికను ఆయన నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ మాట్లాడుతూ... డాల్ఫిన్ ఆవాస ప్రాంతాలను ప్రజల సందర్శనకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయా ప్రాంతాలలో స్థానిక జనాభా, గ్రామస్తుల భాగస్వామ్యం ద్వారా డాల్ఫిన్ సంరక్షణపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కాగా నదీతీర డాల్ఫిన్ లు ఉత్తరప్రదేశ్‌లో అత్యధిక సంఖ్యలో ఉండగా, తరువాతి స్థానాల్లో బీహార్, పశ్చిమ బెంగాల్ అస్సాం రాష్ట్రాలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పౌరుడికి డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో డిజిటల్ సేవలు, ఆర్టీజీఎస్ పై నిన్న ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలందరూ వాట్సాప్ గవర్నెన్స్ సులభంగా ఉపయోగించుకునేలా మరింత సులభతరం చేయాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారా ఆయా ప్రాంతాల్లో దీని గురించి ప్రజల్లో అవగాహన పెంచే దిశగా

చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

--------------------------

తెలంగాణకు కృష్ణా జలాల కేటాయింపులు సమానంగా జరగాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి నిన్న కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. కృష్ణా బేసిన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎక్కువ నీటిని తీసుకుంటోందని ఆరోపించారు. తెలంగాణలో గోదావరిపై ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపులు జరగాలని కేంద్ర మంత్రిని కోరామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్...31 సెకన్లు

--------------------------

తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 3, తెలంగాణలో 3, స్థానాలకు నిన్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తంగా 3 దశల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ ఓట్ల లెక్కింపులో గాదె శ్రీనివాసులు నాయుడు గెలుపొందారు. గుంటూరు ఉమ్మడి కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ విజయం సాధించారు. .50 శాతానికి పైగా ఆయన ఓట్లు సాధించడంతో ఆయనను విజేతగా ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. కాగా ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గానికి ఏలూరు సమీపంలోని సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది.

--------------------------

మరోవైపు తెలంగాణలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ, బీజేపీ మద్దతిచ్చిన అభ్యర్థులు గెలుపొందారు. నల్గొండ-ఖమ్మం-వరంగల్ పీఆర్టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి, కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ ఎన్నికల్లో మల్కా కొమురయ్య విజయం సాధించారని అధికారులు తెలిపారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో ఎవరికీ మెజారిటీ రాకపోవడంతో ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టగా రెండో ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపులో వీరు విజయం సాధించారని అధికారులు వెల్లడించారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ తెలంగాణలో 10 ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. నిన్నటి నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ నెల 10వ తేదీ వరకు నామినేషన్ దాఖలుకు అవకాశం ఉంటుందని పేర్కొంది. 11వ తేదీన నామినేషన్ల పరిశీలన, 13 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువుగా నిర్ణయించింది. ఈ నెల 20న పోలింగ్ జరగనుండగా, అదేరోజు సాయంత్రం కౌంటింగ్ నిర్వహిస్తారు.

--------------------------

తెలంగాణలో రేపటినుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య తెలిపారు. హైదరాబాద్‌లో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 9 లక్షల 96 వేల 971 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలియజేస్తూ...

వాయిస్ .. 29 సెకన్లు

కాగా.. ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఇంటర్మీడియేట్ పరీక్షల్లో భాగంగా ఈరోజు ఇంగ్లీషు పేపర్ – పరీక్ష జరగనుంది.

---------------------------

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలు–ఐటీడీఏల ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ గిరిజన శాఖ మంత్రి జి సంధ్యారాణి తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ఐటీడీఏలపై సభలో ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. జిల్లాల విభజనతో గిరిజనులు తమ పనుల కోసం పొరుగు జిల్లాలోని ఐటీడీఏకి వెళ్లాల్సి వస్తోందని ప్రభుత్వం దృష్టికి వచ్చిందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ ఏర్పాటుకు మెళియాపుట్టి, మందస ప్రాంతాలను గుర్తించామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 34 సెకన్లు

---------------------------

వేసవికాలంలో అధిక వినియోగానికి తగినట్లు ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ ఉత్పత్తి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వేసవి విద్యుత్ వినియోగం, వ్యవసాయ కనెక్షన్ల పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో ఆయన నిన్న సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేసవిలోనూ రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేయాలన్నారు. గృహ, వ్యాపార, పారిశ్రామిక అవసరాలకు ఇబ్బంది లేకుండా 24 గంటల విద్యుత్ అందించాలని చెప్పారు. పెరుగుతున్న వినియోగ డిమాండ్‌ను తీర్చడానికి ప్రత్యామ్నాయంగా పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

---------------------------

గోదావరి డెల్టా ప్రాంతంలో పూడిక తీత కార్యక్రమాలను చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. కూటమి ప్రభుత్వంలో సాగునీటి రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. గోదావరి డెల్టా ఆధునికీకరణకు నిధులు మంజూరు చేశామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్.. 33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా 2025–26 వార్షిక బడ్జెట్‌పై ఈ రోజు సాధారణ చర్చ కొనసాగనుంది. చర్చ చివర్లో ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ సమాధానమివ్వనున్నారు. మరోవైపు శాసనమండలిలోనూ బడ్జెట్ పై చర్చ కొనసాగనుంది.

=====================